

పీడీఎస్ బియ్యం పట్టివేత

హాజీపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని శనివారం హాజీపూర్ పోలీస్‌లు సీజ్ చేశారు. హాజీపూర్ ఎస్సై తెలిపిన వివరాల మండల కేంద్రానికి చెందిన వారనాశి సంపత్ పీడీఎస్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారు అనే సమాచారంతో సోదాలు చేయగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 40 క్వింటాళ్ల బియ్యాన్ని, బొలెరో వాహనాన్ని సీజ్ చేసి సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాండూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) :తాండూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. బోయపల్లి,చౌటపల్లి, తాండూర్, ఐబీ, రాజీవ్ నగర్, కొత్తపల్లి,రేపల్లెవాడ, మాదారం, 3 ఇంక్లైన్, కాసిపేట, చంద్రవెల్లి, ద్వారకాపూర్, అబ్బాపూర్, బెజ్జాల, నర్సాపూర్ గ్రామాల్లో విద్యుత్ ఉండదన్నారు.

పుకార్లను నమ్మవద్దు

చెన్నూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులు సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఓదెలు ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని జిన్నింగు మిల్లు ల్లో సీసీఐ ద్వారా త్వరలో పత్తి కొనుగోలు ప్రారంభమవుతుందని తెలిపారు. సోషల్ మీడియాలో పత్తి కొనుగోలు ప్రారంభమైందని, కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని పుకార్లు వస్తున్నాయని వీటిని నమ్మవద్దన్నారు. పత్తి కొనుగోళ్ల ప్రారంభించే ముందు తాము సమాచారం ఇస్తామన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సమాయత్తం



- 2.32 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- 317 సెంటర్ల ప్రారంభానికి సన్నాహాలు
- కేంద్రాల వద్ద రైతులకు మౌలిక సదుపాయాలు
- మద్దతు ధరలపైనే రైతుల పెదవి విరుపు

మంచిర్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 2005-06 సంవత్సరం వానాకాలం సీజన్‌కుగాను రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం అవుతోంది. జిల్లా లో ఇంకా పూర్తి స్థాయిలో వరి కోతలు ప్రారంభం కాకముందే సెంటర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడంతో వర్షాలు పడి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. దాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందస్తుగా చర్యలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



లక్షెట్టిపేట మండలం గుల్లకోటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్(ఫైల్)

2.32 లక్షల మెట్రిక్ టన్నులు అంచనా...

జిల్లాలో యాసంగి సీజన్‌తో పోలిస్తే వానాకాలం సీజన్‌లో వరి దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా ఈ సారి పంట దిగుబడిపై ప్రభావం చూపింది. వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం జిల్లాలో వానాకాలం సీజన్‌లో లక్షా 57వేల 642 ఎకరాల్లో వరి సాగు చేయగా 2 లక్షల 32 వేల 743 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉంది. అదే ఈ ఏడాది యాసంగి సీజన్‌లో జిల్లాలో ఏకంగా 3 లక్షల 40వేల 301 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేయగా, ప్రకృతి వైపరీత్యాల కారణంగా లక్ష మెట్రిక్ టన్నుల మేర దిగుబడి తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

వానాకాలంలోనూ రూ. 500 బోనస్....

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సన్నరకం వరి ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు రైతులకు అధనంగా క్వింటాలుకు రూ. 500 బోనస్ ప్రకటించింది. గత ఏడాది నుంచి ప్రారంభమైన బోనస్ చెల్లింపులు యాసంగి, వానాకాలం సీజన్‌లలోనూ కొన సాగించారు. సన్నాలకు బోనస్ చెల్లింపులతో వరి సాగు ఊపందుకున్నప్పటికీ అతివృష్టి పంట దిగుబడి తగ్గడా నికి కారణమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

317 కేంద్రాల ఏర్పాటుకు...

వానాకాలం సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొత్తం 317 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 150 కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 97, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 63, మెప్మా ఆధ్వర్యంలో 7 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు..

7లో

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం...
చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్



వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొను గోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఇదివరకే సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశాం. కొన్ని చోట్ల ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాము. కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించాము. రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని ఎండబెట్టుకొని, చెత్తచెదారం లేకుండా చేసి, కేంద్రానికి తీసుకు రావలసి ఉంటుంది.

వైభవంగా సంకట హర చతుర్థి పూజలు



ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

నస్పూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీ లోని లక్ష్మి గణపతి దేవాలయంలో సంకట హర చతుర్థిని పురస్కరించుకుని శనివారం స్వామి వారికి మహా భస్మాభిషేకం వైభవోపేతంగా నిర్వహించారు. సంకట హర చతుర్థి సందర్భంగా ఉదయం భక్తులు ఆలయానికి పెద్ద ఎత్తున చేరుకుని 108 ప్రదక్షిణలు చేశారు. ప్రధానార్చకులు వంశీ కృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం స్వామి వారికి విశేష మహా భస్మాభిషేకం కన్నుల పండుగగా నిర్వహించారు. పురవీధుల్లో స్వామి వారికి పల్లకీ సేవ జరిగింది. చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతిరావు తెలిపారు. చంద్రోదయం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు.

చిన్నారుల ఆహ్లాదం కోసం వసతులు

శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్



పిల్లల ఆట వస్తువులను ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కార్మిక కుటుంబాలకు చెందిన చిన్నారుల ఆహ్లాదం కోసం వసతులు కల్పిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. ఎస్‌ఆర్‌పీ 3,3ఏ గని వనరుల పెంపుదల ప్రణాళిక కమ్యూనిటీ ఓపెన్ జిమ్‌లో భాగంగా కృష్ణకాలనీలోని శాంతి స్టేడియంలో పిల్లలకు అవసరమైన ఊయల, జారుడుబండ, సీ- సాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శాంతి స్టేడియం పరిసర ప్రాంతాల ఉద్యోగుల సౌకర్యం కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చిన్నారులు ఆట వస్తువులను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, పర్యావరణ అధికారి హనుమాన్ గౌడ్, ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

దండేపల్లి నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ జడ్పీటీసీ సభ్యురాలు గడ్డం నాగరాణి-త్రిమూర్తి అన్నారు. దండేపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం మండలంలోని తాళ్లపేట, రెబ్బనపల్లి, కన్నెపల్లి, దండేపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం మత్స్య శాఖ ఆధ్వర్యంలో 3,42,000 నాణ్యమైన చేప పిల్లలను అందజేశారు. వారు మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి వందశాతం సబ్సిడితో చేప పిల్లలను పంపిణీ చేస్తామన్నారు. 35నుంచి 40 ఎంఎం పరిమాణం గల చేప పిల్లలను మత్స్యకారులకు అందించామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా ఎదుగాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు చంద్రకళ, లింగారావు, మత్స్యకారుల ఫిషరీస్ అసిస్టెంట్ శ్రవణ్‌కుమార్, నీల రాజేష్, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, సత్తయ్య, గంగారం, ఏఈవో మౌనిక, మత్స్య పారిశ్రామిక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



చేప పిల్లలను అందజేస్తున్న నాయకులు, అధికారులు

విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం



నినాదాలు చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొడదామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీకాంత్ అన్నారు. పీడీఎస్‌యూ విప్లవ విద్యార్థి అమరవీరుల వర్ధంతి సందర్భంగా శ్రీరాంపూర్‌లో నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, నూతన విద్యా విధానాలతో యూనివర్సిటీలు స్వయంప్రతిపత్తిని కోల్పోయే అవకాశం ఉందని, వీసీలుగా వ్యాపారులు, రాజకీయ నాయకులు ఉండేలా వీలు కలుగుతుందన్నారు. యూనివర్సిటీలను వ్యాపార కేంద్రాలుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని, కార్పొరేట్లు, రాజకీయ నాయకులు ప్రవేశిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విప్లవ విద్యార్థు లైన జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, ప్రసాద్, శంకర్, చేరాలు, రంగవల్లిల ఆశయాల సాధనకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో కనీస వసతు లు లేకుండా ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయని, ఈ విధానాలు ప్రభుత్వాలు విడనాడాలన్నారు. బోధనకు ఉపాధ్యాయులు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సరైన వసతులు కల్పించి, పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్, నాయకులు కార్తీక్, వంశీ, అంజి, సూరి పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడిషీటర్లతో మాట్లాడుతున్న సీఐ హనోక్

బెల్లంపల్లి,నవంబరు8(ఆంధ్రజ్యోతి): రౌడి షీటర్లు నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలని తాళ్లగురిజాల రూరల్ సీఐ హనోక్ అన్నారు. శనివారం తాళ్లగురిజాల పోలీసు స్టేషన్ రౌడీషీటర్లుగా నమోదైనవారితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. క్షణికావేశంలో, వివిధ సందర్భాలు, కేసుల్లో ఇరుక్కున్నవారు సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనకూడదని సూచించారు. టూటౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డిస్ట్రిబ్యూటరీ కాలువ



రౌడిషీటర్లతో మాట్లాడుతున్న సీఐ హనోక్

దండేపల్లి నవంబరు8 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్ గ్రామ సమీపంలో వందూర్‌గూడ వెళ్లే బీటీ రోడ్డుకు అనుకున్న 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ వంతెన వద్ద రక్షణ దిమ్మెలు లేక ప్రమాదకరంగా మారింది. ఎవరైన ఆదమరిస్తే కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. ప్రతీ నిత్యం ఈ రోడ్డు గుండా అనేక వాహనాలు, రైతులు వెలుతుంటాయి. అనుకుంటే పొరబాటే ఏ కొంచెం ఆదమరిచిన కాల్వలో పడిపోవడం కాయం. ఏప్రమాదం జరుగక ముందే సంబంధిత శాఖ అధికారులు స్పందించి డిస్ట్రిబ్యూటరీ కాలువ రోడ్డుకు ఇరువైపు రక్షణ గోడలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

గూడెం ఆలయంలో కిటకిటలాడిన భక్తులు



గూడెంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కుటుంబ సమేతంగా వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు కార్తీక పుణ్యస్నానాలు ఆచరించి, కుటుంబసమేతంగా భక్తులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి నదిలో కార్తీక దీపాలను వదిలారు. అనంతరం సత్యదేవుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలతో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. 507 మంది భక్తులు కుటుంబసమేతంగా స్వామి వ్రతాన్ని నోముకొని పూజలు చేశారు. ప్రధానాలయం ధ్వజ స్తంభం, రావి చెట్టు వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. దీంతో ఆలయం వద్ద భక్తులతో కార్తీక శోభ సంతరించుకుంది. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం వద్ద ఏర్పాటు చేసి నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరిండెంట్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

పిల్లలకు టీకాలు జాగ్రత్తగా ఇవ్వాలి

జిల్లా వైద్యాధికారి అనిత

నస్పూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లలకు, నవ జాత శిశు వులకు టీకాలు ఇచ్చే సమయంలో జాగ్రత్తగా ఇవ్వాలని, జాతీయ టీకా కార్యక్రమంలో భాగంగా పిల్లల వివరాలను ఆశ కార్యకర్తలు సేకరించి అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత అన్నారు. నస్పూర్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని సుందరయ్య కాలనీ ఉప కేంద్రంలో జరిగే టీకాల కార్యక్రమాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి టీకాలపై సూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం జిల్లా వైద్యాధికారి అనిత మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు పిల్లల వివ రాలను సేకరించి ఉంచుకోవాలన్నారు. వాక్సినేషన్ కార్యక్రమాన్ని తల్లులకు అవగాహన కల్పిస్తూ మళ్లీ ఏ రోజు టీకా తీసుకోవాల్సిన సమయాన్ని తెలియజేయాలని చెప్పాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అసౌకర్యాల ఆర్టీసీ బస్టాండ్..

మందమర్రి బస్టాండ్‌కు అరకొర బస్సులు..

ప్రయాణికులకు తప్పని తిప్పలు..

దుర్గంధం వెదజల్లుతున్న పరిసర ప్రాంతాలు



మందమర్రి ఆర్టీసీ బస్టాండ్

మందమర్రిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి పట్టణంలోని మార్కెట్ నడిఒడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండ్ అసౌకర్యాలకు నిలయంగా మారింది. బస్టాండ్‌కు బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ప్రైవేటు వాహనాల్లో వెళ్తూ జేబులను గుళ్ల చేసు కుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. 1993లో దివంగత ఎం పీ కాకా వెంకటస్వామి, అప్పటి ఎమ్మెల్యే బోడ జనార్ధన్‌లు ఆర్టీసీ బస్టాండ్‌కు శంకుస్థాపన చేశారు. బస్టాండ్ నిర్మాణం తర్వాత అందుబాటులోకి వచ్చిందని ప్రజలు సంతోషపడ్డారు. బస్టాండ్ నిర్మాణం పూర్తయి 32 ఏళ్లు కావస్తున్నా పట్టుమని ఐదు బస్సులు కూడా బస్టాండ్‌కు రావడం లేదు. కేవలం బెల్లంపల్లి, మంచిర్యాల బస్సులు మాత్రమే బస్టాండ్‌కు వచ్చి వెళ్తున్నాయి. అప్పుడప్పుడు గోదావరిఖని బస్సులు వచ్చివెళ్తుంటాయి. దీంతో ఆసిఫాబాద్, కరీంనగర్, వరంగల్, పెద్దపల్లి, హైద్రాబాద్ ఇతర దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు బస్టాండ్ వద్ద ఆటోలను ఎక్కి మంచిర్యాలలోని ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లి ప్రయాణిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం ఇక్కడ నుంచి మంచిర్యాలకు పెద్ద సంఖ్యలో పనుల నిమిత్తం వెళ్తుంటారు. బస్సులు లేకపోవడంతో ఆటోలను ఎంగేజ్ చేసుకుని వెళ్తున్నారు. అలాగే మహిళల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం ఈ ప్రాంత మహిళలకు అందడం లేదు. బస్సులు రాకపోవడంతో మహిళలు ప్రైవేటు వాహనాల్లో ఎక్కి జాతీయ రహదారి వద్దకు వెళ్లి బస్సులు ఎక్కుతున్నారు. మార్కెట్ నుంచి యాపల్‌లోని జా తీయ రహదారి వద్దకు వెళ్లడానికి రూ. 20 చెల్లించి వెళ్తున్నారు. ప్రజలు, వ్యాపారులు బస్సులు నడిపించాలని మంచిర్యాల ఆర్టీసీ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించడం లేదు. గతంలో మందమర్రి నుంచి హైద్రాబాద్‌కు రెండు బస్సులు నడిపేవారు. ప్రస్తుతం ఒక బస్సు మాత్రమే నడుపుతున్నారు. మరో బస్సు నడిపిం చాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు.

-సమస్యలకు నిలయంగా..

బస్టాండ్‌కు బస్సులు రాకపోవడంతో పా టు సమస్యలకు నిలయంగా మారింది. మంచిర్యాల, బెల్లంపల్లి, గోదావరిఖని బస్సుల కోసం బస్టాండ్‌కు వెళితే బస్టాండ్‌లో కుక్కలు ఉంటున్నాయి. కుక్కలు ప్రయాణికుల వెంట పడడంతో భయపడుతున్నారు. ఆర్టీసీ ప్రాంగణం పిచ్చి మొక్కలు, చెత్తా, చెదారంతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాండ్‌లో మరుగు దొడ్ల నిర్మాణం చేపట్టగా అవి ఇంత వరకు పూర్తి కాలేదు. మున్సిపాలిటీ సిబ్బంది రోజు చెత్త తొలగిస్తున్నా పశువులు, కుక్కలు అపరిశుభ్రం చేస్తున్నాయి.

ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పిస్తాం

కేవీ రాజశేఖర్ , మంచిర్యాల ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్

మందమర్రి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మరు గుదొడ్లు, తాగునీటి సదుపాయాలను కల్పిస్తాం. బస్టాండ్‌లో పెరిగిన పిచ్చి మొక్కలతోపాటు చెత్తా, చెదారాన్ని తొలగిస్తాం. మందమర్రి బస్టాండ్‌కు అన్ని బస్సులు రావడానికి వీలు పడ లేదు. హైద్రాబాద్‌కు వెళ్లే బస్సు విషయం ఆలోచిస్తాం. త్వరలోనే బస్టాండ్‌ను ఆనుకుని దుకాణ సముదాయాలు ఉన్నాయి దీంతో బస్సులు లోపలికి వెళ్లడానికి కొంత ఇబ్బంది ఉంది. దుకాణ సముదాయాలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

సమ్మక్క సారలమ్మ జాతర అప్పుడే ఏర్పాట్లు

మందమర్రి ఆర్టీసీ బస్టాండ్‌ను సమ్మక్క సారలమ్మ జాతర సమయంలో శుభ్రం చేస్తున్నారు. బస్టాండ్ నుంచి జాతరకు వెళ్లేందుకు పలు డిపోల నుంచి బస్సులు ఇక్కడకు వచ్చిజాతరకు తీసుకు వెళ్తుంటాయి. అప్పుడు మాత్రమే తాగు నీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. జాతర సమయంలో వారం రోజులు మాత్రమే బస్టాండ్ శుభ్రంగా ఉంటుంది. ఆ తర్వాత పట్టించుకునే వారే కరుయ్యారు.

ఆదాయం కోల్పోతున్న ఆర్టీసీ

మందమర్రి నుంచి ప్రతి రోజు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు కరీంనగర్, హైద్రాబాద్, వరంగల్, బెల్లంపల్లి, నిజామాబాద్, ఆసిఫాబాద్ తదితర పట్టణాలకు వెళ్తుంటారు. బస్టాండ్‌కు బస్సులు రాకపోవడంతో ఆర్టీసీ ఆదాయం కోల్పోతోంది. నలుగురు ఉంటే ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకుని వెళ్తున్నారు. వేములవాడ, ఇతర పుణ్యక్షేత్రాలకు ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్నారు. ఆర్టీసీకి రావాల్సిన ఆదాయం ప్రైవేటు వాహనాలకు వెళ్తోంది. అధికారులు స్పందించి మందమర్రి బస్టాండ్‌కు బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్టాండ్‌లో ఉన్న కుక్కలు

యువకుడి గల్లంతు


శ్రావణ్(ఫైల్)

జన్నారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాదంపల్లి గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన గుండా శ్రావణ్‌కుమార్(32) అనే యువకుడు శనివారం గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రావణ్‌కుమార్ నానమ్మ సంవత్సరీకం శుక్రవారం ఉండడంతో గోదావరి స్నానాలు ఆచరించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. అక్కడ స్నానాలు చేస్తున్న క్రమంలో గోదావరిలో నీటి ప్రవాహం పెరగడంతో కళ్లముందే శ్రావణ్‌కుమార్ కొట్టుకుపోయాడు. అధికారులకు సమాచారం ఇవ్వడంతో గాలింపు చర్యలు చేపట్టారు.

విధుల్లో నిర్లక్ష్యం చేసినందుకు..

సీఐపై చర్యలకు రంగం సిద్ధం

శ్రీరాంపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ కేసులో నిందితులు బెయిల్ తెచ్చుకునే వరకు విచారణను పొడిగించారనే ఆరోపణలతో శ్రీరాంపూర్ సీఐ డి వేణుచందర్‌పై ఉన్నతాధికారులు చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. జైపూర్ మండలం నర్సింగాపూర్‌కు చెందిన తాటిపెల్లి శ్రీనివాస్ అలియాస్ డీలర్ శ్రీనివాస్‌కు సంబంధించిన కేసు విషయంలో ఫిర్యాదుపై సీఐ చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చూపారని భావించిన పోలీసు ఉన్నతాధికారులు వేణుచందర్‌పై చర్యలకు పూనుకోనున్నట్లు సమాచారం.

శిథిలావస్థలో గ్రంథాలయం


గ్రంథాలయం ఏర్పాటు చేయనున్న పోలీస్‌స్టేషన్ పాత భవనం

- ఇరుకు గదులతో పాఠకుల అవస్థలు
- పోలీస్‌స్టేషన్ పాత భవనంలోకి మార్చేందుకు చర్యలు

రెబ్బెన, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెబ్బెనలో కొనసాగుతున్న గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకున్నది, ఇరుకు గదిలో సౌకర్యాలు లేక పాఠకులు అవస్థలు పడుతున్నారు. దీంతో పోలీస్‌స్టేషన్ పాత భవనంలోకి మార్చేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. గ్రంథాలయం జ్ఞాన సముపార్జనకు కేంద్రం. పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వం లక్షణాలు పెంపొందిస్తాయి. పేద విద్యార్థులు, నిరుద్యోగ యువతను దృష్టిలో పెట్టుకొని రెబ్బెన పోలీస్ శాఖ గ్రంథాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టబోతోంది. రెబ్బెన పాత పోలీస్‌స్టేషన్‌లో భవనం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. ఎంపీడీవో కార్యాలయ సమీపంలో కొత్తగా పోలీస్‌స్టేషన్ భవనం నిర్మించడంతో సుమారు మూడేళ్ల క్రితం అందులోకి మార్చారు.

దీంతో తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న పోలీస్‌స్టేషన్ భవనం నిరుపయోగంగా మారింది. ముందు భాగంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని భావించారు. తిర్యాణి మండల కేంద్రంలో ఇదే తరహా మాదిరిగా రెబ్బెన పోలీస్‌స్టేషన్ పాత భవనాన్ని గ్రంథాలయంగా మార్చేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సీఐ సంజయ్, ఎస్సై వెంకట్ కృష్ణ ఇటీవల పాత భవనం వద్ద పిచ్చి మొక్కలను తొలగించారు. ఏఎస్పీ చిత్తరంజన్ స్టేషన్‌భవనాన్ని పరిశీలించి గ్రంథాలయం ఏర్పాటుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. త్వరలో భవనానికి రంగులు వేసి గ్రంథాలయం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న రెబ్బెన శాఖ గ్రంథాలయ భవనం శిథిలావస్థలకు చేరుకున్నది. సుమారు 470 మంది డిపాజిట్‌దారులు ఉన్నారు. 4,650 పుస్తకాలున్నాయి. ప్రతి రోజు 50 మంది పాఠకులు ఇక్కడ వస్తుంటారు. కానీ గ్రంథాలయానికి పక్కా భవనం లేక పోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇది శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలం పైకప్పు ఊరుస్తుండడంతో పుస్తకాలు కూడా తడుస్తున్నాయి. కేవలం మూడు గదులు ఉండగా, ఒక గది పాఠకుల కోసం, మరో గదిని స్టోర్ రూం కేటాయించారు. ఇరుకిరుగా గాలి, వెలుతురు సరిగా లేక పోవడంతో పాఠకులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొన్నది. రెబ్బెన పోలీస్‌స్టేషన్ పాత భవనంలో గ్రంథాలయం ఏర్పాటైతే పాఠకులకు కావాల్సిన అన్ని వసతులు అందుబాటులోకి రానున్నాయి. రెండు విశాలమైన గదులు, మరో మూడు చిన్నగదులతో పాటు మరుగుదొడ్డి, తాగునీటి సౌకర్యం ఈ భవనంలో ఉన్నాయి. పుస్తకాలు భద్రపరిచేందుకు స్టోర్ రూం ఉన్నాయి. ప్రధాన రోడ్డుపైనే ఉండడంతో గ్రంథాలయానికి వచ్చే పాఠశాలకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ గ్రంథాలయం అందుబాటులోకి వస్తే నిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగపడనుంది.

త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు..

వెంకటకృష్ణ, రెబ్బెన ఎస్సై.



పోలీస్‌స్టేషన్ పాత భవనాన్ని గ్రంథాలయంగా మార్చాలని నిర్ణయించాం. విషయాన్ని ఎస్పీ, ఏఎస్పీ దృష్టికి తీసుకెళ్లాం. ఇందుకు వారు అంగీకరించి ప్రత్యేక చొరవ చూపారు. భవనంల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించాం. భవనానికి రంగులు వేయించి త్వరలోనే గ్రంథాలయాన్ని ప్రారంభిస్తాం.

అనుమతులు లేని ఫర్నిచర్ పట్టివేత

నస్పూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణం తీగల్ పహాడ్ - ఊరు శ్రీరాంపూర్ ఏరియాలో అనుమతి లేకుండా తయారు చేస్తున్న పర్నిచర్‌ను అటవీశాఖాధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ ఎఫ్ఆర్‌వో అబ్దుల్ అజార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఊరు శ్రీరాంపూర్ ఏరియాలో అక్రమంగా తీసుకొచ్చిన కలపతో ఫర్నీచర్‌ను తయారు చేస్తున్నారని అటవీశాఖాధికారులకు సమాచారం అందింది. దీంతో అధికారులు అక్కడకు వెళ్లి దాడులు తనిఖీలు చేయగా అక్రమ కలపతో తయారు చేసిన పర్నిచర్‌తో పాటు వినియోగించిన యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన కలప విలువ దాదాపు లక్ష రూపాయల వరకు ఉంటుందని డిప్యూటీ ఎఫ్ఆర్‌వో అబ్దుల్ అజార్ చెప్పారు.. దాడిలో ఫ్లైయింగ్ స్క్వాడ్ సెక్షన్ ఆఫీసర్ రవి, అటవీశాఖ, ఫ్లైయింగ్ స్క్వాడ్ బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కళోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ


సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

జన్నారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కళోత్సవాల్లో భాగంగా రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ హైదరాబాద్ వేదిక నిర్వహించిన ట్రెడిషనల్ స్టోరి టెల్లింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రెండో బహుమతి సాధించి ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర జాయింగ్ డైరెక్టర్ చేతుల మీదుగా వర్షిత, అరవిందరాణి రూ.3వేల నగదుతో పాటు సర్టిఫికెట్లు, మెమోంటోలను అందుకున్నారు. దీంతో జిల్లా విద్యాధికారి యాదయ్య అభినందించారు. కార్యక్రమంలో బానావత్ ప్రకాశ్ దాముక కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ స్థాయి క్రీడలు

ములుగు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం జాకారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడలు శనివారం ముగిశాయి. ముఖ్య అతిథులుగా భూపాలపల్లి, ఆసిఫాబాద్ జిల్లాల డీసీవోలు భిక్షపతి, యాదగిరి, ములుగు సీఐ సురేష్, ఎస్సై చంద్రశేఖర్, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు శ్రీనాథ్, రజనీ, నర్మదాబాయి హాజరయ్యారు. జాకారం గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ ఎ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వివిధ అంశాల్లో జరిగిన ఈ క్రీడా పోటీల్లో మొత్తం 935 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. అండర్ 14 ఓవరాల్ చాంపియన్ మంథని, అండర్ 19 జాకారం జట్లు నిలిచాయని వివరించారు. అథ్లెటిక్ విభాగంలో ఓవరాల్ చాంపియన్స్‌గా అండర్ 14 కాసిపేట, అండర్ 17 కాసీపేట , అండర్ 19 జైపూర్ జట్లు విజేతగా నిలిచాయి.. రూరల్ చాంపియన్‌షిప్ ఇండివిజ్వల్ విభాగంలో మధు కాసిపేట, రంజిత్ (ఏటూరు నాగారం), కె.సాత్విక్ (జైపూర్) కైవసం చేసుకున్నారు.

సింగరేణి యాజమాన్యం అధికారుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి కోసం పనిచేస్తున్న అధికారులకు సంబంధించిన ప్రధాన సమస్యలను సింగరేణి యాజమాన్యం పరిష్కరించాలని శనివారం మందమర్రి ఇన్‌చార్జీ జీఎం మల్లయ్యకు అధికారుల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ ఇప్పటికే సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందించినా పట్టించుకోవడం లేదన్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు 2007 నుంచి 2014 వరకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ బకాయిలను, 2022-23-24 ఆర్థిక సంవత్సరాల పీఆర్‌సీని సకాలంలో చెల్లించాలన్నారు. 40 వేల మంది ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులతో సమానంగా 2,300 మంది అధికారులకు కూడా ఉచిత విద్యుత్, ఐఐటీ , ఐఐఎం ఫీజురీయింబర్స్ మెంట్‌ను తమకు కూడా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ బసవరాజు, ఉపాధ్యక్షుడు వర్ధన్, జాయింట్ సెక్రటరీ రవీ, నరేష్, కోశాధికారి సరిత, సంతోష్, రాం బాబు, శంకరయ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం


అథ్లెటిక్స్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ట్రైబల్ మోడల్స్ స్పోర్ట్స్ స్కూల్ మైదానంలో శనివారం ఆదిలాబాద్ జిల్లా జోనల్ పాఠశాలల క్రీడా సమాఖ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభించారు. ఈ పోటీల్లో కుమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు, 30 మంది పీఈటీ, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన వారికి పతకాలు అందజేశారు. అలాగే ఈ నెల 14, 15, 16 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ వెంకటేష్ తెలిపారు. పోటీల్లో రాణించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్, సింగరేణి ఈఎం విజయభాస్కర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీర్ షేకు, పీడీ మీనారెడ్డి, కోచ్‌లు విద్యాసాగర్, వెంకటేష్, మారయ్య, లక్ష్మణ్, లింగయ్య, మల్లేష్, సత్యనారాయణ, రాజ్ మహ్మద్, కృష్ణమూర్తి, లక్ష్మి, అనీత, సంతోష్, శ్రీకాంత్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్ నిధులు పీవీటీజీలకు చెందాలి


నినాదాలు చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ (ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) నిధులు వంద శాతం పీవీటీజీ (పర్టిక్యూలర్లీ వల్నెరబుల్ ట్రైబల్ గ్రూప్)లకు చెందాలని సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి మాన్కు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండల, గ్రామాలోని పీవీటీజీలకు విడతల వారీగా కాకుండా ఒకే సారి ఇళ్లు మంజూరు చేసి వాటి నిర్మాణ బాధ్యతను ఐటీడీఏకు అప్పగించాలని అన్నారు. కోలాం, తోటి తెగలకు చెందిన పీవీటీజీల కోసం మొదటి విడతలో మంజూరైన 2,150 ఇళ్లల్లో కొన్ని పీవీటీజీలకు కాకుండా వేరే వారికి అధికారులు కేటాయించారని చెప్పారు. వాటిని తక్షణమే రద్దు చేసి అర్హులకు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, భీంరావు, తిరుపతి, సోనేరావు, రాజు, జలపతి, అన్నిగా, గోవింద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపు సంఘం సాధించింది శూన్యం


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ అన్ని రంగాల్లో విఫలమయ్యారని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి ఎస్. వెంకటస్వామి, రామగిరి రామస్వామి, అల్లి రాజేందర్ అన్నారు. మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ సీహెచ్‌పీ వద్ద శనివారం నిర్వహించిన గేటు మీటింగ్‌లో వారు మాట్లాడారు. గతంలో మెడికల్ అన్‌ఫిట్ అయినటు వంటి ఉద్యోగుల సంబంధించిన 3,500 కేసులు పెండింగ్‌లో ఉంటే వాటికి పరిష్కారం లేదన్నారు. మారుపేర్లకు దిక్కులేద న్నారు. పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ రద్దు చేస్తామని చెప్పిన మాటలు నీటిమూటలే అన్నారు. ఇప్పటికైనా డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అయిందాల శ్రీనివాస్, వడ్లకొండ ఐలయ్య, చింతం రుక్మయ్య, లింగాల రమేశ్, సత్యనారాయణ, సయ్యద్ అమిర్ పాల్గొన్నారు.

ఉద్యోగులు విధుల్లో ప్రతిభ చాటాలి

శ్రీరాంపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు విధుల్లో ప్రతిభ చాటాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. పర్సనల్ విభాగం ఉద్యోగిని శనివారం ఆయన అభినందించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ ఉద్యోగి వివరాలను ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఉద్యోగి ఫోన్ నంబర్, ఆధార్ బ్యాంకు ఖాతా, తదితర వివరాలను పొందుపర్చాలని సూచించారు. అనంతరం సురేష్‌ను ప్రోత్సాహక బహుమతితో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్, సీనియర్ పీవోలు పి కాంతారావు, సురేందర్, మురళి, పర్సనల్ విభాగం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులకు బీమా వర్తింపజేయాలి



మాట్లాడుతున్న సీఎండీ బలరాం

శ్రీరాంపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేసే ఒప్పంద కార్మికులకు రూ.50 లక్షల ప్రమాద బీమా వర్తింపజేయాలని సీఎండీ ఎన్. బలరాం ఏడు ప్రధాన బ్యాంకుల అధికారులను కోరారు. సింగరేణి భవన్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల ఉన్నతాధికారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత ప్రమాద బీమా ద్వారా సింగరేణి ఉద్యోగులకు రూ.1.25 కోట్ల వరకు, పొరుగు సేవల ఉద్యోగులకు రూ.40 లక్షల వరకు బీమా అందించడం సంతోషదాయకమన్నారు. ఇప్పటి వరకు వివిధ ప్రమాదాల్లో మృతిచెందిన 34 మంది కుటుంబాలకు దాదాపు 30 కోట్ల రూపాయల బీమా సొమ్ము బ్యాంకుల ద్వారా అందించినట్లు చెప్పారు. ఇది వారికి ఆర్థిక భద్రత కల్పిస్తుందన్నారు. అలాగే ఒప్పంద కార్మికులకు సైతం రూ. 50లక్షల వరకు ప్రమాద బీమా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. సింగరేణి ఉద్యోగులు సహజమరణం పొందినా రూ.20 లక్షలు ఇచ్చేలా చూడాలన్నారు. సింగరేణి సంస్థలో అమలు చేస్తున్న బీమా పథకం కోల్ ఇండియాలోనూ అమలవుతున్నట్లు వివరించారు. సింగరేణి సంస్థకు అన్నివిధాలుగా సహకరిస్తున్న బ్యాంకర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్(పర్సనల్) గౌతమ్ పొట్రు, జీఎం(కోఆర్డినేటషన్) టి శ్రీనివాస్, ఏజీఎం (ఫైనాన్స్) చక్రవర్తి, బ్యాంకుల అధికారులు సురేష్ కు మార్, సుమంత్ రెడ్డి, సుజిత్ ఝా, రేఖారావు, రమేష్, విక్రమ్‌సింగ్, రాజేష్ సిన్హా, అజయ్ డిసౌజా, శంకర్ కుమార్, రాజీవ్‌కుమార్, వాణి, మాధురి, సైదులు, మణికందన్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్యం


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలపై సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా అన్నారు. యాజమాన్య మొండి వైఖరిని నిరసిస్తూ జీఎం కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. జీఎం ఎం. శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మెడికల్ పూర్తయిన వారికి ఇంకా నియామక ఉత్తర్వులు ఇవ్వపోవడం సరికాదన్నారు. ఉద్యోగుల సొంతింటి పథకం అమలుకు మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. కార్మికుల పెర్క్స్‌పై ఆదాయపు పన్ను చెల్లించాలన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే ఓసీపీలలో ఓబీ, బొగ్గు వెలికితీసే పనులను కాంట్రాక్ట్ కార్మికులతో చేయించాలని చూస్తున్నారని, తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని తెలిపారు. మారుపేర్లు, విజిలెన్స్ బాధితులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, డిస్మిసల్ ఉద్యోగులకు మరో అవకాశం ఇవ్వాలన్నారు. ఏడాదికి 150 మస్టర్లు అనే సర్క్యులర్‌ను రద్దు చేయాలన్నారు. జూనియర్ అసిస్టెంట్ పరీక్ష లను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, నాగభూషణం, గండి సతీష్, ప్రసాద్ రెడ్డి, గొర్రె నర్సయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎంఓఏఐ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం జీఎం విజయభాస్కర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అధికారులందరికి జీతంలో భాగమైన పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే 2022-23కు సంబంధించిన కోల్ ఇండియా జూన్ -2024లో చెల్లించారని అన్నారు. సింగరేణి సంస్థలో మాత్రం ఇప్పటి వరకు చెల్లింపు చేయక పోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పీఆర్పీ చెల్లింపుకు ఏర్పాటు చేయాలని కోరారు. సంస్థ పట్ల నిజాయితీగా పని చేస్తున్న అధికారులకు భరోసా కల్పించాలన్నారు. సంస్థ లక్ష్య సాధన దిశగా పూర్తి స్థాయిలో పని చేసే విధంగా నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. అధికారులు పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. పీఆర్పీ చెల్లించనట్లయితే ఈ నెల 24 నుంచి నిరాహర దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఓఏఐ అధ్యక్షుడు నరేందర్, ఉపాధ్యక్షులు ఉజ్వల్‌కుమార్ బెహరా, రమేష్, వీరన్న పాల్గొన్నారు.

తపాలపూర్ అడవిలో

చెట్లు నరికివేత

జన్నారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్‌జోన్‌లోని జన్నారం అటవి డివిజన్ పరిధిలో తపాలపూర్‌లోని అటవి ప్రాంతంలో శనివారం కొంత మంది గిరిజనులు సుమారు వంద టేకు చెట్లను నరికివేసినట్లు తెలిసింది. అటవి ప్రాంతంలో ఉన్న మల్యాల గ్రామస్థుల తరలింపులో జాప్యమోనని పలు అనుమానాలకు తావిస్తోంది. విషయం తెలుసుకున్న అటవిశాఖ అధికారులు ఎఫ్‌డీవో రామ్మోహన్ పోలీసుల సహకారంతో సంఘటన స్థలానికి చేరుకొని నష్టాన్ని అంచనా వేశారు. అనంతరం గ్రామస్థులకు అవగాహన కల్పించినట్లు తెలిసింది.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి



మహిళలకు పోషకాహారం, చిరుధాన్యాలు అందజేస్తున్న మహిళ సమాఖ్య సభ్యులు

బెల్లంపల్లి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక అభివృద్ధితో ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ప్రాజెక్టు అధికారి స్వర్ణలత అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల మహిళ సమాఖ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, ఆరోగ్యపరంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం పేదరిక నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా ముందుకు వెళ్లాలని అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహారంలోపంతో ఉన్న తల్లులను, పిల్లలను గుర్తించి వారి ఆరోగ్య పరిరక్షణ కోసం మహిళ సంఘాలు కృషి చేయాలన్నారు. పోషకాహారం లోపంతో బాధపడుతున్నవారికి గుప్పెడు చిరుధాన్యాలు సమీకరించి తల్లులకు పిల్లలకు అందించాలన్నారు. గ్రామ సంఘాల పని తీరు, ఆర్థిక స్వాలంబన ఆరోగ్య సంరక్షణతో పాటు పలు అంశాలపై సీఆర్‌పీలకు శిక్షణ ఇస్తామన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ విజయలక్ష్మీతో పాటు సీఆర్‌పీలు మండల సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం

మందమర్రిటౌన్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఐఎన్‌టీయుసీ సీనియర్ నాయకులు శనివారం ప్రచారం చేశారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరి జనరల్ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సింగరేణి కార్మికులకు ఒరగబెట్టిందేమిలేదన్నారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో కోలుకోలేని దెబ్బతీసి కేసీఆర్ కుటుంబం మాత్రమే సంపన్నులుగా మారారని పేర్కొన్నారు. మూడు సార్లు గెలిచిన బీఆర్ఎస్ పార్టీ ఇక్కడ ఏమి చేయలేదనే విషయాన్ని కూడ ప్రజలు విశ్వసించి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం



దండేపల్లిలో అభివాదం చేస్తున్న గ్రామైఖ్య సంఘుల సభ్యులు

దండేపల్లి నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామైఖ్య సంఘాల సభ్యుల మహిళలందరిని కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఐకేపి రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌లు ఎం నాగలక్ష్మి, ఆర్ లక్ష్మి అన్నారు. శనివారం దండేపల్లిలో మణికంఠ గ్రామూఖ్య సంఘం సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఆర్థికంగా సాధికారిత సాధించేలా స్వయం సహాయక సఘాఘాలు కృషి చేయాలన్నారు. మహిళలు ఇందిరా మహిళ శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోని వ్యాపారవేత్తలుగా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మహిళా సాధికారిత సాధించేందుకు ప్రభుత్వం మహిళలకు వివిధ రకాల పథకాలను ప్రవేశపెట్టి వాటిని అమలు చేస్తోందన్నారు. అనంతరం భారతదేశ పటం వేసి ఆరోగ్యాన్ని పెంచే కూరగాయలు, పప్పుదినుసులు, బియ్యం, పాలు తదితర పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆరోగ్యంతోనే సంఘాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సమైఖ్య సంఘం అధ్యక్షురాలు అనిత, దండేపల్లి ఐకేపీ ఏపీఎం లక్ష్మి, సీసీలు తిరుపతిగౌడ్, గ్రామైఖ్య సంఘం వివోఏ అనంతలక్ష్మి, కార్యదర్శి లావణ్య, కోశాధికారి అంజలీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కోరుట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల-మెట్‌పల్లి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మెట్‌పల్లి పట్టణానికి చెందిన గుడ్ల శంకర్, మెట్‌పల్లి మండలం చింతలపేట గ్రామానికి చెందిన గందం రాజేష్ ద్విచక్ర వాహనాలపై పట్టణ శివారులోని హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుఎదురుగా ఢీకొట్టుకున్నారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వారి బంధువులకు, పోలీసులకు సమచారం అందించారు. కాగా శంకర్‌ను చికిత్స నిమిత్తం నిజామాబాదుకు వారి బంధువులు తరలించంగా రాజేష్‌ను జగిత్యాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

గుండెల్లో.. డీజే దడ



వివాహ వేడుకల్లో
పెద్దపెద్ద శబ్దాలతో ప్రమాదం

వేడుకలు, ఫంక్షన్‌లలో
తప్పనిసరిగా మారిన డీజే

ప్రేక్షక పాత్ర వహిస్తున్న అధికారులు
ఇబ్బందులు పడుతున్న ప్రజలు

బెల్లంపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏమైన ఫంక్షన్‌లు జరిగినప్పుడు జోష్ కోసం మితిమీరిన శబ్దాలతో పెడుతున్న డీజేలు ప్రాణాలు తీస్తున్నాయి. అప్పటి వరకు సంతోషంగా నృత్యాలు చేస్తున్నవారు ఒక్కసారిగా కుప్పకూలి పోతున్నారు. శబ్ధాల హోరుకు వయస్సు మళ్లిన వృద్ధులే కాకుండా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నిర్వహించే ఊరేగింపుల్లో డీజేల వల్ల ఇరుగుపొరుగువారు ఉక్కిరిబిక్కిరై భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మంచి ముహూర్తాలు ఉన్న నేపథ్యంలో వివాహ వేడుకలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో డీజే శబ్ధాలతో ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ప్రాణాలకు ముప్పు...

గతంలో పండుగలు, పెళ్లి వేడుకలకు డప్పులు బాజాభజంత్రీల నడుమ చేసుకునేవారు. ఆ తరువాత కొద్ది రోజులకు బ్యాండ్లు వచ్చాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా, ఏ వేడుకలకైన డీజే పాటల జోరు పెరిగింది. డీజేల్లో వాతావరణంలో శబ్దకాలుష్యం పెరిగి ప్రమాదకరమైన మెదడు, గుండె, చెవికి సంబంధించిన ఇబ్బందులకు గురవుతున్నారు. అతి శబ్ధానికి దగ్గరగా ఉండి డ్యాన్స్‌లు చేస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా పలు వేడుకల్లో గుండెపోటుతో మరణించిన సంఘటనలు లేకపో లేదు. అంతేగాకుండా చెవి, ఇతర రుగ్మతలకు గురైన వారు వేల మందిలో ఉన్నారు.

అర్ధరాత్రి వరకు నృత్యాలు..
ఆందోళనలో ప్రజలు...

ప్రస్తుతం డీజే ట్రెండ్ నడుస్తుంది. డీజే సౌండ్‌లు పట్టణాలకే కాకుండా పల్లెటూరుకు సైతం చేరింది. వివాహాలు, పుట్టిన రోజు వేడుక ఏదైనా డీజే ఏర్పాటు తప్పనిసరిగా మారింది. డీజేలు ఏర్పాటు చేసుకొని డ్యాన్స్‌లు చేయడం ఆనవాయితీగా మారింది. వివాహం అనంతరం భరాత్ నిర్వహించే సందర్భంలో అధిక శబ్ధంతో డీజేలు పెడుతున్నారు. ఈ శబ్ధాలు వేడుకలు నిర్వహించే వారికి ఆనందాన్ని కలిగిస్తున్నా చుట్టుపక్కల వారికి మాత్రం ఇబ్బందులు కలిగిస్తున్నాయి. సాధారణంగా మనం వినకలిగే శబ్ధం 40 నుంచి 50డెసిబుల్స్ మాత్రమే. డీజే శబ్ధ తీవ్రత 100 నుంచి 200 పైగా డిసిబుల్స్ ఉంటుంది. ఇలా శబ్ధాన్ని గంటల తరబడి వింటే మనిషికి చెవిపోటు వస్తుంది. అలాగే ఈ ధ్వని గుండె పోటుకు సైతం దారి తీస్తుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే డీజే శబ్దాల వల్ల ఒత్తిడి, బీపీ ఒక్క సారిగా పెరుగుతుంది. శబ్ధ కాలుష్యంతో గర్భిణులపై, వృద్ధులు, చిన్న పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో డీజేలను నియంత్రించాలని, రాత్రి సమయాల్లో ఎట్టి పరి స్థితుల్లో డీజేలకు అనుమతి ఇవ్వద్దని పేర్కొంటున్నారు.

అధిక శబ్దాలతో ప్రమాదం...
రవి కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు



అధిక శబ్దాలను వెదజల్లే డీజే మోతలతో ఆరోగ్యంపై దుష్ప్రభావం కలుగుతుంది. డీజే శబ్దం గుండెపోటుకు, చెవిపోటుకు గురయ్యే ప్రమాదం ఉంది. శబ్దకాలుష్యం తో గర్భిణులతో పాటు కడుపులో ఉన్న శిశువులపై తీవ్ర ప్రమాదం చూపుతుంది. వినికిడిలోపానికి సైతం దారి తీస్తాయి. భారీ శబ్దాలకు గుండెదడ పెరిగి తీవ్రంగా చెమటలు పట్టి కళ్లు తిరిగి ఎవరైన కిందపడితే వెంటనే ఆసుపత్రిలో చేర్చాలి.

డీజేలను నిషేధించాలి...: పాషా, బెల్లంపల్లి



డీజేలను పూర్తిగా నిషేధించాలి. మాది బెల్లంపల్లి పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియా. నాకు ఇటీవల గుండె కు సంబంధించిన సర్జరీ జరిగింది. రాత్రి ఇంట్లో నిద్రిస్తు న్న సమయంలో కొందరు మా వీధి గుండా భారీ శబ్దా లతో డీజేలతో నృత్యాలు చేశారు. ఆ సమయంలో నా గుండె దడ పెరిగి తీవ్ర ఆందోళనకు గురయ్యాను. మా కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో డీజేలు బందు చేయించారు. డీజే శబ్దా లతో ఎంతో మందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు డీజేలను పూర్తి స్థాయిలో నిషేధించాలి.

కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ధర్నా

గోదావరిఖని, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆర్‌జీ-1 బ్రాంచి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శనివారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మడ్డి ఎల్లయ్య, ఆరెల్లి పోషం మాట్లాడుతూ సింగరేణిలో పెండింగ్ లో ఉన్న కార్మికుల సమస్యలను వెంటనే పరి ష్కరించాలని, కమిటీల పేరు మీద కాలయాపన చేయవద్దని వారు యాజమాన్యా న్ని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిచిన తరువాత కార్మికుల సంక్షేమం కోసం, వారి హక్కుల కోసం కృషి చేస్తున్నప్పటికీ కొన్ని కార్మిక సంఘాలు గనులపై ఏఐటీయూసీపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని చేస్తున్నాయన్నారు. వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించాలని, సొంత ఇంటి పథకం అమలు చేయాలని, మారుపేర్ల మీద ఉన్న విజిలెన్స్ కేసులు పరిష్కరించి వా రి పిల్లలకు ఉద్యోగం ఇవ్వాలని, అలవెన్స్‌ల పై విధిస్తున్న ఇన్కమ్ టాక్స్‌ను కోలిండియాలో మాదిరిగా యాజమాన్యమే భరించాలని వారు డిమాండ్ చేశారు. డిస్మిస్ అయిన ఉద్యోగులకు మరో సారి అవకాశం కల్పించాలని, సింగరేణి యాజమాన్యం గుర్తింపు సంఘంతో చర్చించ కుండా 150 మస్టర్ల సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాం డ్లను యాజమాన్యం త్వరగా స్పందించి పరిష్కరించాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సమాయత్తం

(5వ పేజీ తరువాయి)

చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఆయా కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో ధాన్యం కొనుగోళ్లు చేయనున్నారు. ఈ మేరకు సెంటర్ నిర్వాహకులకు అవసరమైన శిక్షణ పూర్తి చేశారు. అలాగే లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు కోసం మొత్తం 58 లక్షల 18వేల పై చిలుకు గోనె సంచులు అవసరం కాగా 31 లక్షల 35 వేల వరకు అందుబాటులో ఉన్నాయి. అలాగే 6వేల 409 టార్పాలిన్లు, 90 ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు, 447 తేమ యంత్రాలు, 493 ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, తదితర పరికరాలతోపాటు మిగతా గన్నీ సంచులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉం చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి తరలింపునకు చెక్...

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల కు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి దాన్యం తరలింపు జరు గకుండా పకడ్బందీ చర్యలు చేపట్టను న్నారు. కేవలం జిల్లా రైతులు పండించిన దాన్యాన్నే కొనుగోలు కేంద్రాలకు తరలించేలా ఏర్పా ట్లు చేస్తున్నారు. సన్నరకం వడ్లకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తున్నందున అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా శాఖల సిబ్బంది సమన్వయంతో అంత రాష్ట్ర సరిహద్దుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయ నున్నారు. చెక్ పోస్టుల వద్ద 24 గంటల పర్యవేక్షణ చేపట్టాలనే ఆదేశాలు జారీ అయ్యాయి.



స్వల్పంగా పెరిగిన మద్దతు ధరలు....

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా వానాకాలం సీజన్‌లో ధాన్యం మద్దతు ధరలు స్వల్పంగా పెరిగాయి. కేంద్రం ప్రకటించిన మేరకు వరి పంటకు మద్దతు ధర క్వింటాకు గ్రేడ్-ఏ రకం రూ. 2389, కామన్ వెరైటీ ధర రూ. 2369 ఉంది. గత ఏడాదితో పోలిస్తే గ్రేడ్ ఏ, కా మన్ వెరైటీకి రూ. 69 చొప్పున ధరలు పెరిగాయి. గత సంవత్స రం గ్రేడ్-ఏ రకం రూ. 2320 ఉండగా, కామన్ వెరైటీ రూ. 2300గా ప్రకటించారు. అయితే వరిసాగు చేసేందుకు ఎక రాకు సుమారు రూ. 25వేల వరకు ఖర్చు వస్తుందని, సా గు ఖర్చులకు అనుగుణంగా మరి కొంత మద్దతు ధర పెంచాల్సిందనే అభిప్రాయాలు రైతుల నుంచి వ్యక్తమవు తున్నాయి. సన్నరకం ధాన్యానికి రూ. 500 బోనస్‌తో కలిపి క్వింటాకు రూ. 2889 గిట్టుబాటు కానుంది.

కాసిపేట విద్యార్థికి రెండు పతకాలు



రెండు పతకాలతో చరణ్‌తేజ

కాసిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలే జీకి చెందిన చరణ్ తేజ రెండు పతకాలను సాధించాడని కళాశాల పీడీ బాబురావు తెలిపారు. శనివారం కొమురంభీంఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో చరణ్ తేజ 1500 మీటర్లు, 3 వేల మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి పతకాలను సాధించాడు. విద్యార్థిని ప్రిన్సిపల్ శంకర్, అధ్యాపకులు అభినందించారు.

గైర్హాజరు సర్క్యూలర్‌ను రద్దు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఇబ్బందికరంగా ఉన్న గైర్హాజరు సర్క్యూలర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆర్జీ-2 పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై సీఐటీయూ అధికారులకు వినతిప త్రాలను అందజేశారు. వీకేపీ గనిలో ఈస ర్క్యులర్‌ను కార్మికులందరకీ వర్తింప జేస్తున్నారని బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్‌కుమార్ తెలిపారు. 100 మస్టర్ల నిబంధన ఎత్తివేసి 150 మస్టర్లు ఉండాలనే నిబంధనతో ఉద్యోగభద్రకు ముప్పు ఏర్ప డనున్నట్టు తెలిపారు. ఈసర్క్యులర్ కార్మి కుల జీవితాలను ప్రభావితం చేస్తుందని తెలిపారు. కొత్తగా జారీ చేసిన గైర్హాజర్ సర్క్యులర్‌లోని నిబంధనలు, గైర్హాజరీని లెక్కించే పద్ధతులు, సెలవులు మంజూరు ప్రక్రియ కార్మికులను ఇబ్బంది పెట్టే విధంగా ఉన్నట్టు ప్రవీణ్ తెలిపారు. చట్ట బద్ధమైన సెలవు హక్కును పరిగణలోకి తీసుకో కుండా, నిరంకుశ రీతిలో నిబం ధనలు పొందుపరిచినట్టు ప్రవీణ్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాలలో సంపత్, రాంప్రసాద్, భూమయ్య, సాంబరావు, సారంగం, వినేష్, లక్ష్మీరాజం, నాగరాజు, తిరుపతి, వినయ్ పాల్గొన్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

కోరుట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిలాపూర్ నుంచి కోరుట్ల పట్టణానికి గంజాయి సరపరా చేస్తున్న వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. పక్క సమాచారంతో కోరుట్ల పట్టణ శివారులోని అయిలాపూర్ రోడ్డులో వాహనాల తనిఖీని నిర్వహిం చారు. అయిలాపూర్ నుంచి కోరుట్ల వైపు వస్తున్న ఓ ద్విచక్రవాహనాన్ని పరిశీలించగా వాహనంలో 100 గ్రాముల గంజా యి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసు కున్నారు. వాహనం నడుపుతున్న వ్యక్తి అయిలాపూర్ గ్రామానికి చెందిన నల్ల విశాల్‌గా గుర్తించారు.

కాగా అతనితో ఉన్న మ రో వ్యక్తి పరారీ అయ్యాడు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తున్నట్టు ఎస్ఐ పేర్కొ న్నారు. ఇద్దరు వీఆర్ఏలతో కలిసి పంచ నామా నిర్వహించి కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మందమర్రిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మంచిర్యాలలో కేక్ తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు..

మంచిర్యాల క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు నివాసంలో పట్టణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు పెంట రజీత, కిషన్, శంకర్, ప్రభార్ పాల్గొన్నారు.

●టీఎన్‌జీవో మంచిర్యాల కమిటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం కృషి చేస్తున్నారన్నారు. నాయకులు రాంమోహన్, మల్లయ్య, శ్రీపతిబాపురావు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో, మండలంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నస్పూర్ : సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం నస్పూర్‌లోని సీసీసీ కార్నర్ వద్ద కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేశారు. టీపీసీసీ సభ్యుడు నూకల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, నాయకులు నరేష్, రాజేష్, అంజయ్య, తిరుపతి, కృష్ణారావు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద సీఎం జన్మదిన కేక్‌ను కట్ చేసి తినిపించారు. పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేం దర్‌గౌడ్ మాట్లాడారు. నాయకులు లక్ష్మన్, ఫైడిమల్ల నర్సింగ్, బండి శంకర్‌గౌడ్, నర్సోజీ, అందుగుల లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్, శశిధర్, మంతెన భూమయ్య, నూతి అంజి, సారంగపాణి, సంపత్, పాల్గొన్నారు.

జైపూర్ : డీసీసీ జనరల్ సెక్రటరీ రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. కాంగ్రెస్ నాయకులు శీలం వెంకటేష్, పండగ రాజన్న, తిరుపతిరాజు, అనిల్, మున్నా, రమేష్ పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లోని ఐఎన్‌టీయూసీ కార్యాలయం లో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచి పెట్టారు. మాదారం టౌన్‌షిప్ నుంచి ఐబీ కేంద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహిం చారు. ఐబీ కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు సూరం రవీందర్‌రెడ్డి, మురళీధర్‌రావు పాల్గొన్నారు.

హాజీపూర్ : మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. శ్రీనివాస‌రావు, శ్రీశైలం గౌడ్, అంకం కృష్ణమూర్తి, తిప్పని కుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : స్థానిక విశ్రాంతి భవనంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షురాలు ఆదేశాల మేరకు పార్టీనాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌టి ఏ జిల్లా మెంబర్ అంకతి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఎండి ఆరిఫ్, మండల అధ్యక్షుడు పింగలి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు, పట్టణ యూత్ అధ్యక్షుడు వెంకటే ష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెన్నెల : ఖైలారంలో యూత్ నాయ కుడు పోలవేణి మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. 25 మంది స్థానిక యువకులు రక్తదానం చేశారు. గ్రామాల్లో కేక్ కట్ చేసి సీఎం జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్, మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్ గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు కంపెల రాజశేఖర్, గురునాథం మల్లాగౌడ్, సింగతి తిరుపతి, జనగామతిరుపతి, గోలేటి సంధ్య పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో..

కొట్టుకుపోయిన మినీ చెరువు తూము

కొత్త తూమును నిర్మించాలంటున్న గ్రామస్థులు, రైతులు



వర్షాలకు కొట్టుకుపోయిన మినీ చెరువు తూము

మందమర్రిరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొక్కలగుట్ట గ్రామంలో ఉన్న మినీ చెరువు తూము ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. కొన్ని సంవత్సరాల క్రితం కాకతీయుల పాలనలో ఈ మిని చెరువు నిర్మించారు. కొన్నిసంవత్సరాల అనంతరం వర్షాలకు తూము బలహీన పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు తూము కొట్టుకుపోవడంతో చెరువులోని నీరంతా బయటకు వెళ్లిపోయింది. గుట్టల మధ్య ఉన్న చెరువు దిగువ భాగంలో గ్రామ సమీపంలోఉన్న ఊర చెరువుకు నీరు వెళ్తుంది. ఈ ఊర చెరువు కింద సుమారు 400 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. చెరువులో మత్స్యకారులు చేపలను పెంచి విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం మిని చెరువు తూము కొట్టుకుపోయింది. ఈ క్రమంలో ఊర చెరువులోకి నీరు రాక మత్స్యకారులు, రైతులు నష్టపోయే అవకాశం ఉంది. మిని చెరువు కింద సుమారు 80 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగులో ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మిని చెరువుకు నూతన తూము నిర్మించాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

కార్మికుడి ఆత్మహత్య

ఓదెల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీలకుంట గ్రామానికి చెందిన దండు రాజు (47) అనే హమాలీ కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన రాజు శుక్రవారం మద్యం మత్తులో గడ్డి మందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గం

సిర్పూర్(టి), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరీష్, ప్రధాన కార్యదర్శి హరీష్ కుమార్, ఉపాధ్యక్షులుగా జహీర్, పద్మజ, కార్యదర్శులుగా సాయి ప్రవీణ్, సందీప్, రాజేశ్వరి, సుమలత ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సబినా, కో కన్వీనర్లుగా సుమన్, రేణుక, రాజశేఖర్, వెంకటరమణ, రాము, వాసవి, గీత, తరుణ్, విద్య చరణ్, మునిందర్, రాజు, రజిని, ప్రసాద్, యాస్మిన్, కేశవ్, ప్రమోద్, సెలెస్టినా, కళ్యాణి, సంగీతను ఎన్నుకున్నారు.

కేతిని ఆశ్రమ పాఠశాలలో మాక్ పోలింగ్

చింతలమానేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతిని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో శనివారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నామినేషన్, ఓటు వేసే విధానం, ఓట్ల లెక్కింపు, విజేతల ప్రకటన, తదితర అంశాలను విద్యార్థులతో చేయించారు. మాక్ పోలింగ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యా యుడు ధర్మయ్య పరిశీలించారు. విద్యార్థులకు ఎన్నికల వ్యవస్థపై అవగాహన కల్పించేదుకే మాక్‌పోలింగ్ నిర్వహించామని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రావుల మల్లన్న బోనాలు

దహెగాం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల సమీపంలోని ఓర్రెవద్ద రావుల మల్లన్న బోనాల పండగ ఆదివారం నిర్వహంచనున్నామని ఆలయ కమిటీ నిర్వాహ కులు తెలిపారు. కార్తీక పౌర్ణమి తరువాత వచ్చే మొదటి ఆదివారం రావుల మల్లన్న బోనాలు నిర్వహిస్తారు. ఈ బోనాలకు కాగజ్‌నగర్, పెంచికలపేట, భీమిని, దహెగాం, తదితర మండలాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి వారికి బోనాలు సమర్పిస్తారు.

బెల్ట్ ఫుల్



- జిల్లాలో విచ్చలవిడిగా బెల్టు షాపులు
- ప్రోత్సహిస్తున్న వైన్సు నిర్వాహకులు
- మద్యం అధిక రేట్లకు విక్రయిస్తున్నా పట్టింపు కరువు
- పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్నా మారని వైఖరి

చింతలమానేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఊరురా మద్యం ఏరులై పారు తోంది, లక్ష్యాల మాటున ప్రధాన దుకాణాల నిర్వహకులు గ్రామాలను పంచుకుంటూ దర్జాగా ఊరుకో మద్యం దుకాణం తరహాలో బెల్టు షాపుల అక్రమ దందాను మూడు, పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా నిర్వహిస్తు రెండు చేతులా ఆర్జిస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 15 మండలాల పరిధిలో 38 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఒక్కో మద్యం దుకాణం పరిధిలో గ్రామానికి రెండు చొప్పున సుమారు వెయ్యికి పైగానే బెల్టుషాపులు కొనసాగుతున్నాయంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తోంది. బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఈ దందాకు అడ్డుకట్ట పడడం లేదని చెబుతున్నారు. ఫలితంగా ఎక్కడ చూసినా బెల్టు షాపుల దందానే కనిపిస్తోంది. దానికి తోడు బెల్టు షాపులోనే గుడుండా, దేశీదారు వంటి అక్రమ మద్యం కూడా లెక్కకు మిక్కిలి విక్రయాలు సాగుతున్నాయి.

గుడుంబా తయారీ మానేసిన వారికి..

ఓ వైపు గుడుంబా తయారీ మానేసిన వారికి ప్రభుత్వం స్వయం ఉపాధి మార్గాలతో జీవనోపాధి కల్పిస్తుంటే, మరో వైపు బెల్టు దుకాణాలు పల్లె, పట్టణ ప్రజలను మత్తులో ముంచెత్తుతున్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు కొనసాగుతున్నా.. చర్యలు తీసుకోడవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతుందన్న ఆరోపణలు సర్వత్రా విన్పిస్తున్నాయి. జిల్లాలోని కొందరు మద్యం షాపుల వారే కమీషన్లకు బెల్టు షాపుల నిర్వహణ చేయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బెల్టు షాపులు ఒక్కరిని చూసి ఒకరు పెడుతూ ఈ దందానే జీవనో పాధిగా చేసుకుంటున్నారని తెలుస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం దాకా ..రాత్రి వేళల్లో సైతం మద్యం అందుబాటులో ఉంచుతూ ప్రజలను మత్తులో ముంచుతున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం కాటన్లు (ఫైల్)

మద్యం మత్తులో గ్రామాలు..

ఒకప్పుడు పట్టణ ప్రాంతాల్లోనే పరిమితమైన ఈ దందా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ విచ్చలవిడిగా కొనసాగుతోంది. వార్డుకో దుకాణం చొప్పున ఏర్పాటు చేయడంతో గ్రామాల్లో జోరుగా మద్యం దందా సాగతుంది. ఒక్కో గ్రామంలో సుమారుగా 10 బెల్టు షాపుల వరకు ఉంటాయి. ఇందులో రోజుకు ఒక్కోషాపు నుంచి రూ.5వేల నుంచి 10వేల మద్యం అమ్మకాలు జరిగితే సుమారుగా రోజుకు రూ. 50వేల నుండి లక్ష వరకు మద్యం అమ్మకాలు ఒక్కో గ్రామంలోనే జరుగుతున్నాయి. జిల్లాలో 33 వైన్స్ షాపులు, మూడు రెస్టారెంట్ బార్లు ఉన్నాయి. 335 గ్రామ పం చాయతీలు, మరో 300 వరకు అనుబంధ గ్రామా లు ఉండగా మద్యం దందా రోజుకు ఏ స్థాయి లో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో దాదాపుగా వెయ్యికి పైగానే బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. బెల్టు దుకాణాల్లో మద్యం బాటిళ్లను ఎంఆర్పీ కంటే రూ. 40నుంచి 60 వరకు ఎక్కువ ధరలకు విక్రయిస్తూ అవసరమైతే మద్యాన్ని కల్తీ చేస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో సైతం ఎప్పుడు అవసరమైతే అప్పుడు అన్ని వేళల్లో మద్యం లభిస్తోంది. గతంలో టీ తాగడానికి హోటల్‌కు వెళ్లేవారు కాని ప్రస్తుతం ఉదయం లేవగానే బెల్టు దుకాణానికి వెళ్తూ తమ ఆరోగ్యాలను నాశనం చేసుకుంటున్నారు. ఈ వ్యవహారమంతా అధికారులకు తెలిసినా బెల్టు దందాపై కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలోని ఉన్నతాధికారులు ఈ దందాపై ప్రత్యేక దృష్టి సారిస్తేనే బెల్టు దందాకు అడ్డుపడడమే కాకండా ప్రజల ఆరోగ్యాలకు రక్షణ కల్పించిన వారవుతారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

బెల్టు దందా సాగ కుండా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. పెంచికలపేట, దహెగాం, చింతలమానేపల్లి తదిత ర మండలాల్లోని పలు గ్రామాల్లో ఇటీవల గుడుం బా నిషేధిస్తూ గ్రామస్థులు తీర్మానాలు చేశారు. మద్యం విక్రయించినా, తాగినా వారిపై చర్యలు తీసుకునేలా ప్రతిజ్ఞ చేస్తున్నారు. దీనికి తోడు అధికారులు సైతం గ్రామాల్లో బెల్టు దందాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడల్లో సత్తా చాటాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఓటు జీఎం రాజమల్లు

రెబ్బెన, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రమతో బొగ్గు ఉత్పత్తిలో ప్రతిభ చాటుతున్న సింగరేణి ఉద్యోగులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రీడా పోటీల్లోనూ సత్తా చాటాలని బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటు జీఎం రాజమల్లు అన్నారు. డబ్ల్యూపీఎస్ జీఏ 92వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా శనివారం గోలేటిలోని భీమన్న స్టేడియంలో నియర్ బై ఫుట్ బాల్ పోటీలను డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహారాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల ఉద్యోగ క్రీడాకా రులు ప్రతి దినం నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ సమష్టిగా పోటీల్లో పాల్గొని కోల్ ఇండియా స్థాయిలో రాణించాలని అన్నారు. గతంలో పతకాలు సాధించిన సీనియర్ క్రీడాకారులను అబినందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జగ్గయ్య, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కో ఆర్డినేటర్ అన్వేష్, జనరల్ క్యాప్టెన్ కిరణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు తనిఖీ డ్యూటీలొద్దు



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ మండలాధ్యక్షుడు సాయి

పెంచికలపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు తనిఖీ డ్యూటీలొద్దని టీఎస్‌యూటీఎఫ్ మండలాధ్యక్షుడు సాయి అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ మహాసభలో ఆయన మాట్లాడారు. పాఠశాలల పర్యవేక్షణ కోసం ఇప్పటికే మండలానికి ఒక ఎంఈవో, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్, ఎంఎస్‌వోలు ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇతర జిల్లాల అధికారులు కూడా ఉన్నారని తెలిపారు. కానీ ఇటీవల మళ్లీ పర్యవేక్షణ నిమిత్తమైన ఉపాధ్యాయులను ప్రైమరీ స్కూల్స్, హైస్కూల్స్, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ లెవల్ లోపల తనిఖీ చేయడానికి కొన్ని టీంలు వేయడం కోసం ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. దీని ద్వారా ఉపాధ్యాయులు బడికి దూరమై బోధనేతర పనుల్లో ఎంగేజ్ అవుతారని చెప్పారు. దీంతో ఆయా సబ్జెక్టులపై భారం పడి విద్యార్థులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు అనీల్‌కుమార్, మల్లన్న, రవీందర్, సతీష్, తిరుపతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం గోలేటిటౌన్ షిప్‌లోని జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం జీఎం విజయభాస్కర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తిరుపతి, భయ్యమొగిలి మాట్లాడుతూ కార్మికులకు మెడికల్ బోర్డు వెంటనే ఏర్పాటు చేసి పాత విధానంలోనే ఇన్వాలిడేషన్ ఇవ్వాలని, మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు వెంటనే నియమక పత్రాలు ఇవ్వాలని, సింగరేణి ఉద్యోగులకు సొంత ఇల్లు పథకం అమలు చేయాలని, డిస్మిస్ అయిన ఉద్యోగులకు ఒక సారి మళ్లీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. 160 మాస్టర్లు చేయాలనే సర్క్యులర్‌ను రద్దు చేయాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో శేషశైనారావు, రాజేష్, ఆనంద్, కిరణ్ బాబు, ఓదేలు, అంజయ్య, ఆఫ్రిద్, సింహాద్రి, షకీల్, రారాజు, గోపాల్, రవికుమార్, రమేష్, రాజు, లక్ష్మినారాయణ, రమేష్, వెంకటేష్, అబ్దుల్ వాసీం, లవరాజు, అన్వేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

దహెగాం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిన్నరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థి ఎల్కరి రాజేశ్వరి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యా యురాలు సునీత, పీడీ రవి తెలిపారు. మంచిర్యాలలో ఈ నెల 7న నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన అండర్-17 జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిందని తెలిపారు.

పెద్దవాగులో దీపాలు వదిలిన మహిళలు



దీపాలు వదులుతున్న మహిళలు

దహెగాం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని పెద్దవాగు నది తీరాన శనివారం కార్తీక సందడి నెలకొంది. భక్తులు పెద్దవాగులో పుణ్య స్నానాలు ఆచరించి సైకత లింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకుడు పరమేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు



ఆసిఫాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్/తిర్యాణి/వాంకిడి/కెరమెరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు కేక్ కట్ చేశారు. డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, అసద్, ఆసీఫ్, వసంత్‌రావు, కాలీం, జమీర్, దీపక్, శివప్రసాద్, గోపాల్, జలీమ్, ప్రవీణ్, మహేష్, జావీద్, అబ్బు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు. తిర్యాణి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆత్రం వినోద్, అనీల్‌గౌడ్, సాగర్, వెంకటేశంగౌడ్, పున్నంకుమార్, రాజు, విజయ్, శంకర్, బాలేష్‌గౌడ్, బాబురావు, వెంకటేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు. వాంకిడి మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం కార్యాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నారాయణ, ప్రశాంత్, అనీల్, గణేష్, శంకర్, దాదాజీ, పెంటు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. కెరమెరి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చేశారు. కార్యక్రమంలో నాయకులు కుసుమరావ్, మునీర్ అహ్మద్, లక్ష్మణ్, జగన్నాథ్‌రావు, లింబారావు, జలపతి, సుందరసింగ్, తిరుపతి, ధర్మ, రాజు, భీంరావు, బాబునాయక్, తిరుపతి, బాబురావు, శంకర్, ముకుంద్‌రావు, దిలీప్, ముజ్జు, రాజు, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



వాంకిడిలో వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

బెంబేలెత్తిస్తున్న శునకాలు

- కాలనీల్లో స్వైరవిహారం
- పట్టించుకోని అధికారులు



వీధుల్లో తిరుగుతున్న శునకాలు

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ఆయా కాలనీల్లో ప్రజలను శునకాలు బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులుగా గుంపులుగా రాత్రి వేళల్లో ఎక్కువగా తిరుగుతూ ఉండడంతో పట్టణ వాసులు భయాందోళన చెందుతు న్నారు. పలు కాలనీల్లో చిన్న పిల్లలు, వృద్ధులు, పశువులపై దాడులు చేస్తున్నాయి. రోడ్లపై వెళ్లే వాహన దారులు, పాదచారుల వెంటపడి తరుముతూ గాయపరుస్తున్నాయి. వీధుల్లో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయని ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఏడాది క్రితం ఒకే రోజు 10 మందికి పై దాడి చేయడంతో గాయాలు అయ్యాయి. వీధి కుక్కల బెడదను నివారించేందుకు వాటికి నియంత్రణ ఆపరేషన్లు చేసేవారు. ప్రస్తుతం ఆపరేషన్లు, లేదా పట్టుకునేందుకు ప్రణాళికలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో కుక్కల సమస్య తీవ్ర రూపం దాల్చింది. రాత్రి వేళల్లో ఆయా కాలనీల్లో గుంపులు గుంపులు తిరుగుతుండడంతో ప్రజలు బెంబెలెత్తుతున్నారు. కాలనీల్లో కుక్కల బెడద అధికం కావడంతో పిల్లలను పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. రాత్రి వేళల్లో కొత్త వారు వస్తే వారి వెంట పడి పరుగులు తీయిస్తున్నాయి. గతంలో ఎన్నో సంఘటనలు జరిగినా కూడా అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. ఏ కాలనీలో చూసినా గుంపులు, గుంపులుగా కుక్కలు సంచరిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. అధికారులు, సిబ్బంది వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

పంటలపై అడవిపందుల దాడి



అడవి పందుల దాడిలో ధ్వంసమైన పంట

కాగజ్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరి, పత్తి పంట చేతికొచ్చిన సమయంలో అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. రాత్రి వేళల్లో అడవి పందులు పంటపొలాల్లో తిరుగుతూ యథేచ్ఛగా ధ్వంసం చేస్తున్నాయి. దీంతో నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగజ్‌నగర్ మండలం కోసిని, రేగులగూడ తదితర గ్రామాల్లో వరి, పత్తి పంట సాగు చేశారు. సుమారు పది ఎకరాల్లో పంటలను అడవి పందులు ధ్వంసం చేశాయని రైతులు చెబుతున్నారు. వారం రోజుల క్రితం కోసిని, రేగులగూడ, ఊట్‌పల్లి తదితర గ్రామాల రైతులు అటవీ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తమకు పరిహారం ఇప్పించాలని కోరారు. దాదాపు రెండు గంటల పాటు ఈ ధర్నాను నిర్వహించారు. అధికారులు స్పందించి పరిహారం కోసం సర్వేలు చేస్తామని, తప్పకుండా ఆదుకునేందుకు ప్రయత్నాలు చేస్తామని హామీ ఇచ్చారు. కోసిని, రేగులగూడ, ఊట్‌పల్లి, రింగన్‌ఘాట్ తదితర గ్రామాలు అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండటంతో రాత్రి వేళల్లో పందుల బెడద అధికంగా ఉంటుందని పలువురు రైతులు చెబుతున్నారు. అడవి పందులను చంపితే అధికారులు తమపై కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని, దీంతో తాము ఏమీ చేయకుండా వదిలేస్తే తమ పంట పూర్తిగా పోతోందని చెప్పారు. అధికారులు రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించి పందుల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

రాత్రి వేళల్లో పంటలపై దాడులు..



రాత్రి వేళల్లో పంటలపై అడవి పందులు దాడులు చేస్తున్నాయి. కొతకు వచ్చిన వరి పంటను ధ్వంసం చేస్తున్నాయి.. రాత్రి వేళల్లో ఏ సమయంలో తమ పంటపై దాడి చేస్తున్నాయో అర్థం కావడం లేదు. ఉదయం పొలానికి వెళ్లి చూడాలంటే భయంగా ఉంటుంది. అధికారులు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

- గుర్లే రవీందర్, రైతు, కోసిని